సాగుకు సమాయత్తం

- పంట పొలాలను సిద్ధం చేసుకుంటున్న రైతులు
- ఇప్పటికే నారుమళ్లు పోసిన అన్నదాతలు
- యాజమాన్య పద్ధతులు మేలంటున్న అధికారులు


జూపూడి పొలంలో ట్రాక్టర్‌తో వేసవి దుక్కులు దున్నుతున్న రైతు

ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు రైతులు సమాయత్తమవుతున్నారు. గతేడాది పత్తి, మినుము, మొక్కజొన్న వంటి పంటలు వేసిన పొలాలు ఖాళీగా ఉండటంతో రైతులు వేసవి దుక్కులు దున్నుతున్నారు. ముందుగా మాగాణి భూముల్లో వరి సాగు చేపట్టేందుకు ఎన్టీటీపీఎస్ బూడిద నీటిని వినియోగించుకుని ఇప్పటికే వరి నారుమళ్లు పోశారు. జూన్ రెండో వారంలో వర్షాలు పడితే నాట్లు వేసేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది ఖరీఫ్‌లో సుమారు 8 వేల ఎకరాల్లో సాగు చేపట్టే అవకాశం ఉందని వ్యవసాయ శాఖాధికారులు చెబుతున్నారు. వరి పండించే త్రిలోచనాపురం, మూలపాడు గ్రామాల్లో ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో భూములు తీసుకునేందుకు సిద్ధమవడంతో కొందరు రైతులు సందిగ్ధంలో పడ్డారు. యాజమాన్య పద్ధతులు పాటిస్తే మెరుగైన దిగుబడులు సాధించవచ్చని అధికారులు సూచిస్తున్నారు.

8 వేల ఎకరాల్లో సాగుకు సన్నద్ధం

మండలంలో సుమారు పది వేల ఎకరాల వ్యవసాయ భూముల్లో ఈ ఏడాది సుమారు 8 వేల ఎకరాల్లో సాగు చేపట్టేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. ఇప్పటికే వేసవి దుక్కుల పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ఎన్టీటీపీఎస్ బూడిద నీటితో కొందరు రైతులు వరి నారుమళ్లు పోశారు. జూన్ రెండో వారంలో తొలకరి వర్షాలు పడితే వరినాట్లు ముమ్మరంగా సాగే అవకాశం ఉంది. ఈ ఏడాది వరితో పాటు పత్తి, మినుము, మిర్చి, మొక్కజొన్న, నువ్వులు, ఇతర కూరగాయ పంటలు సాగుచేసే అవకాశం ఉంది. వర్షాలు వెనకడుగు వేసినా త్రిలోచనాపురం, జూపూడి, మూలపాడు, ఇబ్రహీంపట్నం గ్రామాల్లో బూడిద నీటిపై ఆధారపడి వరినాట్లు వేస్తారు.

వేసవి దుక్కులతో అనేక లాభాలు

ఖరీఫ్ సీజన్‌లో సాగు చేపట్టే రైతులు వేసవి దుక్కులు చేపట్టాలని వ్యవసాయ శాఖాధికారులు సూచిస్తున్నారు. వేసవి దుక్కులతో అనేక ప్రయోజనాలు ఉంటాయి. తొలకరి వర్షాలు పడగానే భూమి కోతకు గురికాకుండా చేస్తుంది. వర్షాలతో భూమిపై పొర తిరగబడి నేల సారవంతం అవుతుంది. భూమిలో తేమశాతం పెరిగి భూసారం వృద్ధి చెందుతుంది. దుక్కులు దున్నే ముందు గొర్రెలు, మేకలు, పశువుల మందను తోలడం వలన వాటి విసర్జన పదార్థాలు భూసారాన్ని పెంచుతాయి. పశువుల ఎరువు, వర్మి కంపోస్ట్ వేయడం వలన భూమి పూర్తిస్థాయిలో సారవంతం అవుతుంది. పొలంలో చెత్త, ఆకులు వంటివి కాల్చివేయకుండా నేలలో కలిసిపోయేలా దున్నితే ఎరువుగా మారుతుందని వ్యవసాయ శాఖాధికారి శైలజ తెలిపారు.


త్రిలోచనాపురంలో ఖరీఫ్ సీజన్‌కు సిద్ధంగా ఏపుగా పెరుగుతున్న వరి నారు మడి

భూ సేకరణపై సందిగ్ధంలో రైతులు

అమరావతి రాజధాని అవసరాల నిమిత్తం మూలపాడు, త్రిలోచనాపురం, కాచవరం, కేతనకొండ గ్రామాల వ్యవసాయ భూములు ప్రభుత్వం ల్యాండ్ పూలింగ్‌లో తీసుకునేందుకు ఇప్పటికే గ్రామసభలు పెట్టారు. రైతులను కలెక్టర్ కార్యాలయానికి పిలిపించి రైతుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది పంటలు సాగు చేసుకునే అవకాశం ఉంటుందో లేదో అని రైతులు సందిగ్ధంలో పడ్డారు. అయినా కొంత మంది రైతులు ధైర్యం చేసి దుక్కులు దున్నుతున్నారు. ఇప్పటికే నారుమళ్లు పోసి వ్యవసాయానికి సిద్ధమయ్యారు.

సాగు చేపట్టాలంటే భయమేస్తోంది



త్రిలోచనాపురం ప్రాంతంలో మూడెకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రతి ఏడాది ఖరీఫ్, రబీలో వరి పండిస్తా. ఈ ఏడాది పంట భూములు ప్రభుత్వం తీసుకుంటుందని చెబుతున్నారు. కుటుంబానికి జీవనాధారం అయిన పొలాలు తీసుకుంటే ఇబ్బందులు పడతాం. ప్రభుత్వ తీరుతో సాగు చేపట్టాలంటేనే భయమేస్తోంది.

– సాంబశివరావు, రైతు, మూలపాడు

సాగుకు భూములు సిద్ధం



ఏటా ఐదెకరాల్లో వరి సాగు చేస్తా. ఇప్పటికే దుక్కులు దున్ని నారుమళ్లు పోశా. పది రోజుల్లో వర్షాలు వస్తే పర్వాలేదు. వర్షం రాకున్నా ఎన్టీటీపీఎస్ నీటితో నాట్లు ప్రారంభిస్తా. ప్రభుత్వం భూములు తీసుకుంటుందనే ప్రచారంతో కొందరు రైతులు వెనకడుగు వేస్తున్నారు.

– కాళింగి రామయ్య, రైతు, త్రిలోచనాపురం

క్లుప్తంగా

90 మందికి వైద్య పరీక్షలు



జి.కొండూరు: మండల పరిధి కవులూరులో ధన్వంతరి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ శ్రీవాణి, డాక్టర్ ఈశ్వర్ పర్యవేక్షణలో 90 మందికి బీపీ, షుగర్ పరీక్షలు నిర్వహించి 35 రోజులకు సరిపడా మందులను అందజేశారు. ప్రతి నెలా రెండో ఆదివారం వైద్య శిబిరాన్ని నిర్వహిస్తామని ట్రస్టు ప్రతినిధులు తెలిపారు.

వెబ్ కౌన్సెలింగ్‌ను నిరసిస్తూ ఉపాధ్యాయుల ధర్నా



తిరువూరు: ఉపాధ్యాయ బదిలీల్లో వెబ్ కౌన్సెలింగ్ విధానాన్ని రద్దు చేయాలని కోరుతూ గంపలగూడెం మండల పీఆర్‌టీయూ, డీపీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఆదివారం మండల విద్యా శాఖ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయులు ధర్నా నిర్వహించారు. వెబ్ కౌన్సెలింగ్ వలన ఉపాధ్యాయులకు అన్యాయం జరుగుతోందని, మాన్యువల్ కౌన్సెలింగ్ నిర్వహించాలని డిమాండ్ చేశారు. డీపీఆర్‌టీయూ, పీఆర్‌టీయూ మండల శాఖ అధ్యక్షులు ఎన్.నరసింహారావు, ఏవీ నరసింహారావు నాయకత్వం వహించారు.

విద్యార్థులకు ఈత పోటీలు



తిరువూరు: ప్రతి రోజూ ఈత కొడితే మానసిక ఆరోగ్యంతో పాటు శారీరక ధృఢత్వం పెంపొందుతుందని తిరువూరు ఎస్ఐ సత్యనారాయణ అన్నారు. లక్ష్మీపురంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఆదివారం విద్యార్థులకు ఈతపోటీలు నిర్వహించారు. పోటీల విజేతలకు ఎస్ఐ బహుమతి ప్రదానం చేశారు. ఆయన మాట్లాడుతూ చిన్నతనం నుంచే ఈత నేర్చుకునే విద్యార్థులు ఎటువంటి సమస్యలనైనా సులువుగా ఎదుర్కోగలరన్నారు. శారీరక రుగ్మతలకు గురికారని చెప్పారు. ఈత పోటీల్లో విజేతలను ఎస్ఐ అభినందించారు. నగర పంచాయతీ కమిషనర్ లోవరాజు, డాక్టర్ మధుకీర్తి తదితరులు పాల్గొన్నారు.

రైస్ మిల్లులో రేషన్ బియ్యం పట్టివేత



తిరువూరు: ఎ.కొండూరు మండలం కొత్త రేపూడి రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వ చేసిన 34 బస్తాల రేషన్ బియ్యాన్ని రెవెన్యూ అధికారులు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని కనిపించకుండా మొక్కజొన్న విత్తనాలతో కలిపి ప్యాక్ చేసిన మిల్లు నిర్వాహకులు అధికారుల కన్నుగప్పే ప్రయత్నం చేసినా ఫలించలేదు. విస్సన్నపేటలో కూడా ఒక రైస్ మిల్లులో ఇదే విధంగా మొక్కజొన్న విత్తనాలతో కలిపి రేషన్ బియ్యాన్ని నిల్వ చేసినట్లు సమాచారం అందుకున్న అధికారులు తనిఖీలు నిర్వహిస్తున్నారు. కొత్త రేపూడి మిల్లు యజమానిపై కేసు నమోదు చేశామని రెవెన్యూ అధికారులు తెలిపారు.

చేప మందు పంపిణీ



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మృగశిర కార్తె సందర్భంగా ఆస్తమా రోగులకు ఉచిత చేప మందు పంపిణీ కార్యక్రమం కొండపల్లిలో ఆదివారం జరిగింది. గత 75 ఏళ్లుగా ఆస్తమా రోగులకు జనాబ్ హాజీ హకీ మహమ్మద్ యూసుఫ్ అలీ కుటుంబం కొండపల్లిలో చేప మందు పంపిణీ చేస్తున్నారు. జనాబ్ హాజీ హకీ మహమ్మద్ యూసుఫ్ అలీ మృతిచెందడంతో వారి మనువళ్లు మహమ్మద్ మసూద్ అలీ జిన్నా, మహమ్మద్ మహమూద్ అలీ ప్రతి ఏడాది మృగశిర కార్తె తొలి రోజు చేప మందు పంపిణీ చేస్తున్నారు. కృష్ణ, ఎన్టీఆర్, గుంటూరు, ప్రకాశం, ఖమ్మం, సూర్యాపేట జిల్లాల నుంచి సుమారు 375 మంది రోగులు వచ్చి చేప మందు తీసుకున్నారు. చేప మందును తీసుకున్నవారు పాటించవలసిన జాగ్రత్తలను సూచించారు.

ఫిషర్‌మెన్ సొసైటీలో కొత్త సభ్యత్వాలకు తీర్మానం

రాయనపాడు(విజయవాడరూరల్): రాయనపాడు హరిజన ఫిషర్‌మెన్ (మత్స్యకార) సొసైటీ లో కొత్త సభ్యత్వాల నమోదుకు సర్వజన మహాసభ తీర్మానించింది. ఆదివారం ఎస్సీ ఏరియాలోని రామాలయం ఆవరణలో సొసైటీ అధ్యక్షుడు జొన్నకూటి దుర్గారావు అధ్యక్షతన మహాసభ జరిగింది. రాయనపాడు గ్రామం చెరువులో చేపల వేలం పాటకు సమయం సమీపిస్తుండటంతో సొసైటీలో కొత్త సభ్యత్వాలు నమోదు చేయాలని స్థానికులు మల్లాది వెంకటేశ్వరరావు, పెయ్యల కిశోర్, కృష్ణమోహన్,బ యాకోబు, నెమలికంటి కోటేశ్వరరావు తదితరులు తమ అభిప్రాయం వ్యక్తంచేశారు. అధ్యక్షుడు దుర్గారావు అనారోగ్యంగా ఉండటంతో అతని కుమారుడు శ్రీనివాసరావు మాట్లాడుతూ సభ్యులు మాత్రమే సమావేశంలో చర్చించుకోవడం జరుగుతుందని, తర్వాత స్థానికులతో సమావేశం ఏర్పాటు చేస్తామని చెప్పడంతో అందుకు స్థానికులు అభ్యంతరం తెలిపారు.

ఇరువర్గాల వాగ్వాదం

అధ్యక్షునికి అనారోగ్యంగా ఉంటే కార్యదర్శి మాట్లాడాలన్నారు. దీంతో కార్యదర్శి బొల్లా రమేష్ బాబు మాట్లాడుతుండగా గత కొన్నేళ్లుగా కొత్త సభ్యత్వాల నమోదుకు అవకాశం లేకుండా పోయిందని, పాలకవర్గంలో కొందరు చనిపోవడంతో వారి కుటుంబ సభ్యులకు అవకాశం కల్పించడంతో పాటు కొత్త వారిని సభ్యులుగా చేర్చుకోవాలని కోరారు. చేపల వేలం పాటలో సొసైటీకి లభించే మొత్తం లో సభ్యులకు లబ్ధి చేకూరేలా సొసైటీ చర్యలు చేపట్టాలని చర్చ జరిగింది. దీనిపై ఇరు వర్గాల మధ్య వాదోపవాదాలు జరిగాయి. గతంలో రాయనపాడు చెరువుకు సంబంధించిన మత్స్యకార సొసైటీలో రాయనపాడు, ఈలప్రోలు, పైడూరుపాడు గ్రామాల వారు ఉండేవారు. ప్రస్తుతం గ్రామాల్లో సొసైటీలు కొత్తగా ఏర్పడ్డాయి. దీంతో కొత్త సభ్యత్వం నమోదు చేయాలని పట్టుపట్టారు. అనంతరం కొత్త సభ్యత్వాల నమోదుకు సమావేశం ఆమోదించింది. సమావేశంలో కమిటీ సభ్యులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు

ఏఓ రంగనాథ్‌బాబు

రాయనపాడు(విజయవాడరూరల్): మేలు రకం విత్తనాలతో అధిక దిగుబడులు సాధ్యమని విజయవాడ రూరల్ మండల వ్యవసాయాధికారి బి.రంగనాథ్‌బాబు అన్నారు. వికసిత్ కృషి సంకల్ప్ అభియాన్ కార్యక్రమం రాయనపాడు గ్రామంలో రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో ఆదివారం జరిగింది. ఏఓ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రతి రైతు ముందుగా భూసార పరీక్షలు చేయించుకొని దాని ఫలితంగా పంటలను సాగు చేసుకోవాలని చెప్పారు. రసాయనిక ఎరువుల వాడకం తగ్గించుకోవాలని, సస్యరక్షణ చర్యలు చేపట్టాలని, ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలను రైతు సేవా కేంద్రాల్లో కొనుగోలు చేయవచ్చన్నారు. శిక్షణ వ్యవసాయ సహాయ శాస్త్రవేత్త కె.రాజశేఖర్ మాట్లాడుతూ రైతులు మేలు రకం విత్తనాలతో నారుమడి పోసుకొని నాట్లు వేయాలన్నారు. సమగ్ర వ్యవసాయ పద్ధతులను రైతులకు వివరించారు. అనంతరం జక్కంపూడి గ్రామ రైతు సేవా కేంద్రంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు

వీరులపాడు: రౌడీషీటర్లు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడటం, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడితే సహించేది లేదని ఎస్ఐ అనిల్ హెచ్చరించారు. వీరులపాడు పోలీస్ స్టేషన్‌లో మండలంలోని రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రౌడీషీటర్లపై ప్రత్యేక నిఘా ఉంటుందని, ఎప్పటికప్పుడు వారు అప్రమత్తంగా ఉండాలన్నారు. నేరాలు, వివాదాలు, ఘర్షణలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సత్ప్రవర్తనతో నడుచుకునే రౌడీషీటర్లను గుర్తించి వారిపై ఉన్న షీట్ తొలగించేలా ఉన్నతాధికారులకు సిఫారసు చేస్తామని చెప్పారు. అనంతరం వారితో సత్ప్రవర్తనతో ఉంటామని ప్రమాణం చేయించారు. పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సెలింగ్

నందిగామ రూరల్: నేర చరిత్ర కలిగిన వారు తీరు మార్చుకుని సమాజంలో బాధ్యతాయుతమైన పౌరులుగా నడుచుకోవాలని సీఐ వైవీఎల్ నాయుడు పేర్కొన్నారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ రౌడీషీటర్లపై ఎప్పటికప్పుడు నిఘా ఉంటుందన్నారు. ముఖ్యంగా శాంతి భద్రతలకు విఘాతం కలిగించినా, వివాదాలు, ఘర్షణలకు పాల్పడినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ నేర చరిత్రను మానుకుని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషకర జీవితాన్ని గడపాలని సూచించారు. అనంతరం నేరాలు, తదితర శాంతి భద్రతలకు విఘాతం కలిగించే పనులు చేయమని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఎస్ఐ అభిమన్యు, సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్ఎంఎంఎస్‌కు జెడ్పీ విద్యార్థిని ఎంపిక


విద్యార్థిని జాకియా సుల్తానాను అభినందిస్తున్న హెచ్ఎం హేమలత, ఉపాధ్యాయులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): నేషనల్ మీన్స్ మెరిట్ స్కాలర్‌షిప్‌నకు స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల 8వ తరగతి విద్యార్థిని షేక్ జాకియా సుల్తానా ఎంపికైందని పాఠశాల హెచ్ఎం హేమలత తెలిపారు. విద్యార్థిని జాకియా సుల్తానాను ఉపాధ్యాయులు సన్మానించి అభినందనలు తెలిపారు. హెచ్ఎం మాట్లాడుతూ జాతీయ స్కాలర్‌షిప్ పొందేందుకు విద్యార్థులకు శిక్షణ అందించిన ఉపాధ్యాయులను ప్రశంసించారు. మోడల్ పేపర్లతో పరీక్షలు నిర్వహించి మెంటల్ ఎబిలిటీతో సమగ్రంగా గణితం, భౌతిక, రసాయన, జీవ, సాంఘిక శాస్త్రాలలో శిక్షణ ఇచ్చిన పీజీటీ ఉపాధ్యాయులు డి.నరసింహారావును అభినందించారు. విజయం సాధించిన విద్యార్థికి యేడాదికి రూ.12వేలు చొప్పున నాలుగేళ్ల స్కాలర్‌షిప్ పొందుతారని తెలిపారు.

నిత్యాన్నదానానికి విరాళం



పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీతిరుపతమ్మవారి ఆలయంలో నిత్యాన్నదానానికి ఆదివారం తెలంగాణ రాష్ట్రం, ఖమ్మం పట్టణానికి చెందిన నామా శరత్‌బాబు రూ.10,116 విరాళాన్ని ఆలయ ఈఓ కిశోర్ కుమార్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు దాతలను అమ్మవారి శేషవస్త్రం, ప్రసాదాలతో సత్కరించారు.

• చాట్రాయిలో గాలివాన బీభత్సం


చాట్రాయి శివాలయం వద్ద విరిగిపడిన ధ్వజ స్తంభం

మండలంలోని చాట్రాయి, పోతనపల్లి గ్రామంలో ఆదివారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఉరుములు, మెరుపులతో బలమైన గాలి వీయడంతో చాట్రాయి శివాలయం ధ్వజ స్తంభం విరిగింది. భారీ వృక్షాలు నేలకొరిగి రోడ్లపై పడిపోవడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. 20 ఇళ్ల రేకులు ఎగిరిపోయాయి. చింతలపూడి–విస్సన్నపేట రహదారిలో చెట్లు విరిగి పడడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

– చాట్రాయి


పైకప్పు రేకులు లేచిపోయిన ఇల్లు


ఇంటిపై పడిన చెట్టు కొమ్మలు

రోడ్డుకు అడ్డంగా కూలిన చెట్లు

- తొలగించని మున్సిపల్ సిబ్బంది
- రాకపోకలకు ఇబ్బందులు


నూజివీడులోని తాతయ్యబాబు ఆసుపత్రి పక్క వీధిలో రోడ్డుపైనే ఉన్న కూలిన చెట్టు

నూజివీడు: పట్టణంలోని తాతయ్యబాబు ఆస్పత్రి పక్క వీధిలో శనివారం రాత్రి ఈదురు గాలులకు కూలిన చెట్లను రోడ్డుపై నుంచి తొలగించకపోవడంతో రాకపోకలకు స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. మున్సిపల్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంతో 31, 32 వార్డు ప్రజలకు తిప్పలు తప్పలేదు. స్థానికులు పలుమార్లు మున్సిపల్ అధికారులకు ఫోన్ చేసి చెప్పినా పట్టించుకోకపోవడంపై వారు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇలా వదిలేస్తే తాము ఎలా రాకపోకలు సాగించాలని ప్రశ్నిస్తున్నారు.

ఏరియా ఆస్పత్రి ఆవరణలో పశువుల సంచారం

ప్రహరీ కూలి పది నెలలైనా పట్టించుకోని వైనం


ఏరియా ఆసుపత్రిలో నందనంతోట వైపు కూలిపోయిన ప్రహరీ

నూజివీడు: పట్టణంలోని ఏరియా ఆసుపత్రి ప్రహరీ కూలి పది నెలలు అవుతున్నా నిర్మించకుండా గాలికొదిలేశారు. గత ఏడాది ఆగస్టు 31న కురిసిన భారీ వర్షాలకు పీపీ యూనిట్ పక్కన ఉన్న గోడ, మార్చురీ వద్ద గోడ కూలింది. వాటిని వెంటనే నిర్మించకుండా అలాగే వదిలేయడంతో నందనం తోట వైపు నుంచి పశువులు, జీవాలు, పందులు ఆస్పత్రి ఆవరణలోకి వస్తున్నాయి. ఇప్పటికైనా నిధులు మంజూరు చేసి ప్రహరీ నిర్మించాల్సిన అవసరం ఉంది.

షైనింగ్ స్టార్ పురస్కారాలకు విద్యార్థుల ఎంపిక

మునునూరు: పదో తరగతిలో మెరిట్ సాధించిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న షైనింగ్ స్టార్ పురస్కారాలకు మండల విద్యార్థులు ఏడుగురు ఎంపికయ్యారని ఎంఈఓ బీవీఎస్ సుబ్బారావు తెలిపారు. గురుకుల విద్యార్థినుల్లో కె.సాయి సింధు (578), టి.సాహితి (571), ఎం.ప్రియాంక (571), టి.ఐశ్వర్య (569), ఐ.హిమబిందు (550) ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ లక్ష్మీకుమారి తెలిపారు. చెక్కపల్లి జెడ్పీ హైస్కూల్ నుంచి వి.దివ్యహర్షిణి (571), చైతన్య హైస్కూల్ నుంచి బి.లీలా కృష్ణ(566) ఎంపికయ్యారు.

- చాట్రాయి: మండలంలోని పదో తరగతి పరీక్షల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందించనుంది. షైనింగ్ స్టార్స్ కార్యక్రమంలో భాగంగా పదో తరగతిలో ప్రతిభ చూపిన అందే అక్షయ (577), పరసా రేవతి (576), మల్లికా వాసంతి (565), వెంకట నాగ త్రివేణి (558), కోపూరి తిరపతిరావు (576), బాణావతు రాజ్‌కుమార్ (569)లను ప్రభుత్వం ఎంపిక చేసింది. ఎంపికైన ప్రతిభావంతులకు రూ.20 వేల నగదు, ప్రశంసాపత్రం అందించనున్నారు.

అందని 108 వాహన సేవలు

చాట్రాయి: రోగులకు అత్యవసర సేవలందించే 108 వాహన సేవలు నిలిచిపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రమాదాలకు గురైన బాధితులను తక్షణమే ప్రభుత్వ ఆస్పత్రులకు తరలించేందుకు మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి అమలు చేసిన 108 వాహన సేవలు ప్రజలకు అందుబాటులో లేకపోవడంతో బాధితులు నానా ఇబ్బందులు పడుతున్నారు. చాట్రాయి, మునునూరు, ఆగిరిపల్లి మండలాల్లో 108 వాహనం వారం రోజుల కిందట మరమ్మతులకు గురవడంతో సేవలు నిలిచిపోయాయి. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి బాధితులకు సేవలందించాలని ప్రజలు కోరుతున్నారు.

నేడు ప్రజా సమస్యల పరిష్కార వేదిక

నూజివీడు: ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం ఉదయం 10 గంటల నుంచి నిర్వహిస్తామని సబ్ కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా సమస్యలపై అర్జీలు స్వీకరిస్తామని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యోగా పేరుతో కొత్త నాటకాలు

సీపీఐ ఎంఎల్ లిబరేషన్ విమర్శ

నూజివీడు: ప్రభుత్వాలు సంక్షేమ పథకాలను అమలు చేయకుండా, ప్రజా సమస్యలను పరిష్కరించకుండా, అభివృద్ధి చేయకుండా పాలనా వైఫల్యం నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకే యోగా పేరుతో కొత్త నాటకాలు ఆడుతున్నాయని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డి. హరినాథ్ ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. ప్రజలేమీ అమయాకులు కాదని.. కాయకష్టం చేసుకుని బతికే బడుగు జీవులకు ఏ యోగాసనాలు అవసరం లేదన్నారు. దేశంలో నిరుద్యోగాన్ని రూపుమాపాల్సింది పోయి పెంచుతోందన్నారు. కార్మికులు, రైతుల హక్కులను కాలరాస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు రానున్న రోజుల్లో ప్రజలు బుద్ధి చెప్పడం ఖాయమన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలి



సత్యనారాయణపురం(విజయవాడసెంట్రల్): వాహనదారులు పోలీసు, మోటారు వాహనాల నిబంధనలను తప్పక పాటించాలని మూడో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కె.కిశోర్‌బాబు పేర్కొన్నారు. స్థానిక సత్యనారాయణపురం పరిధిలోని బీఆర్టీఎస్ రోడ్డులో మూడో ట్రాఫిక్ పోలీసులు వాహనాల బ్లాక్ ఫిల్మ్‌లపై ఆదివారం ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఈ డ్రైవ్‌లో నిబంధనలకు విరుద్ధంగా బ్లాక్ ఫిల్మ్‌లు వాడుతున్న వాహనాలను గుర్తించి, ఆ వాహనదారులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ ఉన్న బ్లాక్ ఫిల్మ్‌లను వారిచే తొలగింపచేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ కిశోర్‌బాబు మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా రోడ్డు భద్రత నిబంధనలు, పోలీసు, మోటారు వాహనాల చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. వాహనాలకు ముందు, వెనుక అద్దాలకు 70 శాతం, సైడు విండోలకు 50 శాతం విజిబిలిటి ఉండేలా చూసుకోవాలని ఆదేశించారు.